# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 78 EDITOR:CHERUKU UPENDAR, DATE : WEDNESDAY 19 JULY 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 78 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : బుధవారం 19 జూలై 2023 పేజీలు : 4 వెల : 5/-


పేదల కోసం

## వందే భారత్ సరికొత్త రైళ్లు

న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు



కేంద్రంలోని మోదీ సర్కారు ప్రవేశపెట్టిన వందే భారత్ రైళ్లు సామాన్యులకు గుదిబండలా మారాయి. ఆయా రైళ్లలో ఛార్జీలు ఎక్కువ ఉండటంతో సామాన్యులు ప్రయాణించలేకపోతున్నారు. వందే భారత్ రైళ్లు ప్రజలను వేగంగా

మిగతా 2లో...

పార్టీలది ఒకే ఒక మంత్రం ..

## కుటుంబం కోసం..!



న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు

రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం సిద్ధమవుతున్న ప్రతిపక్షాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం తీవ్రంగా విరుచుకుపడ్డారు. బెంగళూరులో సమావేశమైన పార్టీలకు ఒకే ఒక మంత్రం ఉందని, అది.. కుటుంబం యొక్క, కుటుంబం ద్వారా, కుటుంబం కోసం అని వివరించారు. అందుకే ప్రజలు 2024లో మళ్లీ ఎన్డీయేను అధికారంలోకి తేవాలని నిర్ణయించుకున్నారన్నారు. ఎన్డీయేకు వ్యతిరేకంగా బెంగళూరులో జరుగుతున్న సమావేశంలో 26 పార్టీలు పాల్గొంటుండగా, న్యూఢిల్లీలో జరిగే ఎన్డీయే పక్షాల సమావేశానికి 38 పార్టీలు హాజరుకాబోతున్నాయని తెలుస్తోంది. అండమాన్ అండ్ నికోబార్ దీవుల్లోని పోర్టు బ్లెయిర్‌లో వీర్ సావర్కర్

మిగతా 2లో...

# కేటీఆర్ X రేవంత్



- తెలంగాణలో కరెంట్ మంటలతో పొలిటికల్ హీట్
- రేవంత్ రెడ్డి కామెంట్స్‌తో మొదలైన వ్యవహారం
- బీజేపీ, బీఆరెస్ చీకటి మిత్రులు.. వారిది ఫెవికల్ బంధం
- 24 గంటలూ సింగిల్ ఫేజ్ విద్యుత్తు సరఫరా : కేటీఆర్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో ప్రస్తుతం కరెంట్ మంటలు పొలిటికల్ హీట్ పెంచుతున్నాయి. రేవంత్ రెడ్డి కామెంట్స్‌తో మొదలైన వ్యవహారం.. ప్రస్తుతం సవాళ్లు, ప్రతిసవాళ్లతో మాంచి జోరు మీద ఉంది. అగ్ర నేతలు మాటలు, తూటాలు పేల్చుతున్నారు. మరికొందరు అయితే యాక్షన్‌లోకి దిగి.. ఏకంగా సబ్ స్టేషన్లకు ఫీల్డ్ విజిట్ అంటూ వెళ్తున్నారు.తెలంగాణలో కరెంటు సరఫరా 24 గంటలు ఉండడం లేదని తాను నిరూపిస్తానని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సవాలు చేశారు. ఈ విషయం నిరూపించడానికి మంత్రి కేటీఆర్ ఎక్కడికి రమ్మంటే అక్కడికి తాను వస్తానని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో త్రీ ఫేస్ కరెంటుపై అధికారులు నియంత్రణ పాటిస్తున్నారని, సింగిల్ ఫేజ్ కరెంటు మాత్రమే 24 గంటలు ఇస్తున్నారని చెప్పుకొచ్చారు. గాంధీ భవన్‌లో రేవంత్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. 24 గంటల విద్యుత్ పై చర్చ కోసం సిద్దిపేట, సిరిసిల్ల, చింతమడక, గజ్వేల్, మంత్రి జగదీశ్వర్ రెడ్డి సొంత గ్రామం అయినా సరే ఎక్కడికైనా తాను రావడానికి రెడీగా ఉన్నానని అన్నారు. విద్యుత్ కొనుగోలు పేరుతో పదే పదే ప్రజలను దోచుకుంటున్నారని ఆక్షేపించారు. దొంగ లెక్కలు చూపించి రూ. 8 నుంచి రూ. 9 వేల కోట్లు దోచుకుంటున్నారని

మిగతా 2లో...

రెయిన్... రెయిన్...

## హైదరాబాద్‌లో వానలే వానలు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఎట్టకేలకు తెలుగురాష్ట్రాల్లో మొదలైన వానలు..రెండు రాష్ట్రాల్లోనూ ఆగకుండా జల్లులు కురుస్తున్నాయి. హైదరాబాద్ అంతటా దట్టమైన మేఘాలు కమ్మేశాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో రాగల 72గంటల్లో

మిగతా 2లో...

# కమలంలో ఏం జరుగుతోంది

న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు



భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్రాల నాయకత్వం విషయంలో సందిగ్ధతను ఎదుర్కొంటోంది. జాతీయస్థాయిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా రూపంలో ఆ పార్టీకి బలమైన, తిరుగులేని ఆదరణ కల్గిన నాయకత్వం ఉన్నప్పటికీ, రాష్ట్రాల్లో నాయకత్వం ఆదరణ కోల్పోయి వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. పార్టీకి బలం అనుకున్న నేతలే బరువుగా మారిన పరిస్థితులు నెలకొన్నాయి. అలాగని ఆ నేతలను పూర్తిగా కాదనలేక, అవుననలేక అధిష్టానం ఇరకాటంలో పడింది. ముఖ్యంగా కొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు ఎదుర్కోబోతున్న చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఛత్తీస్‌గఢ్‌లో రమణ్‌సింగ్, మధ్యప్రదేశ్‌లో శివరాజ్‌సింగ్ చౌహాన్, రాజస్థాన్‌లో వసుంధరా రాజే నేతృత్వంలో ఎన్నికలను ఎదుర్కోడానికి పార్టీ అధిష్టానం మొగ్గుచూపడం లేదు. అలాగని ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని అప్పటికప్పుడు తయారుచేయడం సాధ్యం కాదని అధిష్టానానికి తెలుసు. అయితే ఎప్పటికైనా ప్రత్యామ్నాయం అవసరమే అన్న ఉద్దేశంతో ఇప్పటి

మిగతా 2లో...

## ఆరోగ్యశ్రీ బోర్డు భేటీ

హాజరైన మంత్రి హరీష్ రావు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

మంగళవారం జూబ్లీహిల్స్ లోని ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి హరీశ్ రావు అధ్వర్యంలో బోర్డు మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో హెల్త్ సెక్రెటరీ రిజ్వీ, ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సిఇఒ విశాలాచ్చి, సీఎం ఓఎస్డీ గంగాధర్, డిఎంఇ రమేష్ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ జి శ్రీనివాస్ రావు, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఇతర అధికారులు పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఆరోగ్యశ్రీ పరిమితి 2 నుండి 5 లక్షల కు పెంచిన దృష్ట్యా కొత్త ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులను రూపొందించి, స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా జిల్లాల్లోని లబ్ధిదారులకు అందించాలని నిర్ణయం

మిగతా 2లో...

ప్రధానమంత్రి పదవిపై

## కాంగ్రెస్ పార్టీకి ఆసక్తి లేదు

భారత దేశ ఆత్మ, రాజ్యాంగం, లౌకికవాదం, సాంఘిక న్యాయం, ప్రజాస్వామ్యాలను పరిరక్షించడంపై తమ పార్టీ లక్ష్యం

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంచలన వ్యాఖ్యలు



బెంగళూరు- ప్రభాత సూర్యుడు

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఏకమవుతున్న ప్రతిపక్షాలు బెంగళూరులో సోమ, మంగళవారాల్లో విస్తృతంగా చర్చలు జరుపుతున్నాయి. భావ సారూప్యతగల 26 ఎన్డీయేయేతర పార్టీలు ఈ సమావేశాల్లో పాల్గొంటున్నాయి. అటువంటి సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు.మల్లికార్జున ఖర్గే మంగళవారం ప్రతిపక్ష పార్టీల సమావేశంలో మాట్లాడుతూ, ప్రధాన మంత్రి పదవిపై కాంగ్రెస్ పార్టీకి ఆసక్తి లేదని చెప్పారు.

మిగతా 3లో...

# కొత్త అలయన్స్ పేరు 'ఇండియా'



బెంగళూరు- ప్రభాత సూర్యుడు

బీజేపీని ఎదుర్కొనేందుకు ఏకమైన విపక్ష కూటమికి 'ఇండియా' అనే పేరును ఖరారు చేశాయి. భారత జాతీయ ప్రజాస్వామ్య సమష్టి కూటమిగా నిర్ణయించాయి. ఈ పేరుపై నేతలంతా సుముఖత, ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిని అధికారికంగా ప్రకటించవలసి ఉంది. ఐ - ఇండియా, ఎన్ - నేషనల్, డి - డెమొక్రాటిక్, ఐ - ఇంక్లూజివ్, ఎ - అలయెన్స్ ('ఇండియా' )గా నూతన కూటమికి పేరు పెట్టినట్లుగా తెలిపారు. మొదట ఆర్జేడీ పేరును ట్వీట్ చేసి డిలీట్ చేసింది. అధికారికంగా అందరూ కలిసి ప్రకటిస్తే బాగుంటుందన్న ఉద్దేశంతోనే ఇలా చేసినట్లుగా తెలుస్తోంది. బెంగళూరులో సోమ, మంగళవారాల్లో జరుగుతున్న ప్రతిపక్ష పార్టీల సమావేశంలో కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, ఆప్, జేడీయూ, ఆర్జేడీ, జేఎంఎం,

మిగతా 3లో...

ఉమెన్ చాందీ

## కన్నుమూత



తిరువనంతపురం- ప్రభాత సూర్యుడు

కేరళ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత ఊమెన్ చాందీ మంగళవారం కన్నుమూశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో కలిసి ఆయన భారత్ జోడో యాత్రలో పాల్గొన్నారు. 79 ఏళ్ల చాందీ మరణవార్తను ఆయన కుటుంబ

మిగతా 3లో...

### పార్టీలది ఒకే ఒక మంత్రం ..

# కుటుంబం కోసం..!

(మొదటిపేజీ తరువాయి)

అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనాన్ని మోదీ మంగళవారం వీడియో కాన్ఫరెన్సింగ్ విధానంలో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భారత దేశ దుఃఖానికి బాధ్యులైనవారు ఇప్పుడు తమ దుకాణాలను తెరిచారని చెప్పారు. ఈ దుకాణాల్లో కులతత్త్వ విషం, విపరీతమైన అవినీతి గ్యారంటీగా దొరుకుతాయన్నారు. ఇప్పుడు ఈ పార్టీలు బెంగళూరులో ఒకే వేదికపైకి వచ్చాయన్నారు. ఈ ప్రతిపక్షాలు ఓ పాట పాడుతున్నాయని, అయితే వాస్తవం వేరొకటి ఉందని చెప్పారు. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీలను పరోక్షంగా ప్రస్తావిస్తూ, "ఇది కట్టర్ అవినీతి సమ్మేళనమని ప్రజలు అంటున్నారు. ఈ సమావేశానికిగల మరొక ప్రత్యేకత ఏమిటంటే, కోట్లాది రూపాయల అవినీతి కేసులో బెయిలు మీద బయట ఉన్నవారిని ఎంతో గౌరవంతో చూస్తున్నారు. మొత్తం కుటుంబ సభ్యులంతా బెయిలు మీద ఉంటే, మరింత ఎక్కువగా గౌరవిస్తున్నారు. ఓ జన సముదాయాన్ని అవమానించినందుకు కోర్టు శిక్షిస్తే, అలా శిక్ష పొందినవారిని గౌరవిస్తున్నారు" అని మోదీ చెప్పారు.

పశ్చిమ బెంగాల్‌లో పంచాయతీ ఎన్నికలకు ముందు, ఆ తర్వాత జరిగిన హింసాకాండను ప్రస్తావిస్తూ, బెంగళూరు సమావేశంలో పాల్గొన్న ప్రతిపక్ష నేతలను వారిపై వచ్చిన అవినీతి ఆరోపణల గురించి అడిగినపుడు, వారు మౌనంగా ఉన్నారన్నారు. పంచాయతీ ఎన్నికల్లో హింసాత్మక సంఘటనలు జరిగాయని, దీనిపై వీరంతా మౌనాన్ని ఆశ్రయించారని చెప్పారు. తమను కాపాడాలని కాంగ్రెస్, వామపక్షాల కార్యకర్తలు వేడుకున్నప్పటికీ, వారి నేతలు మాత్రం స్వార్థపూరిత రాజకీయాలకోసం వారిని దయనీయ పరిస్థితుల్లో వదిలేశారన్నారు. తమిళనాడులో అవినీతి కేసులు చాలా ఉన్నాయన్నారు. ఈ కేసులు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయని, నిందితులకు ప్రతిపక్ష నేతలు క్లీన్ చిట్ ఇస్తున్నారని తెలిపారు. బెంగళూరులో జరుగుతున్నది స్వచ్ఛమైన అవినీతి సమావేశమని ఆరోపించారు. ఈ పార్టీలకు అభివృద్ధిపై దృష్టి లేదని, కొన్ని పార్టీలు తమ వంశపారంపర్య వారసత్వ ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తున్నాయని, దేశ ప్రయోజనాలు, సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. ప్రజాస్వామిక వ్యవస్థలో వారసత్వ రాజకీయాలకు ప్రతిపక్ష పార్టీలు గుడ్డిగా మద్దతిస్తున్నాయన్నారు. రూ.20 లక్షల కోట్ల అవినీతి గ్యారంటీతో ప్రతిపక్షాలు ఏకమయ్యాయని మండిపడ్డారు.

**అందరికీ అవకాశాలు**

అందరినీ కలుపుకొనిపోతూ, అందరికీ అవకాశాలు లభించే సరికొత్త అభివృద్ధి నమూనాకు తాను కట్టుబడి ఉన్నానని మరోసారి మోదీ తెలిపారు. తన ప్రభుత్వ హయాంలో ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు, అండమాన్ అండ్ నికోబార్ దీవులు అభివృద్ధి చెందినట్లు చెప్పారు.

# రేవంత్ X కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపించారు. దీని మీద విచారణ చేయడానికి మీరు సిద్ధంగా ఉన్నారా? అని నిలదీశారు. రాష్ట్రంలో కేవలం 8 నుంచి 12 గంటల త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా అవుతోందని అన్నారు.వ్యవసాయానికి ఉచిత కరెంటు అంశాన్ని ప్రజల సెంటిమెంట్‌గా మారుస్తూ స్వార్థం కోసం సీఎం కేసీఆర్ వాడుకోవద్దని తానా సభల్లో తాను చెప్పినట్లుగా రేవంత్ రెడ్డి వెల్లడించారు. అక్కడ చేసిన వ్యాఖ్యలను తప్పుడుగా ప్రచారం చేసి అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని ఆక్షేపించారు. ఉచిత కరెంట్ అనేది పేటెంట్ కాంగ్రెస్ పార్టీది అయితే, అసలు కాంగ్రెస్ పార్టీనే కరెంటు ఇవ్వలేదన్నట్లుగా మాట్లాడడం కరెక్టు కాదని రేవంత్ రెడ్డి అన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరా అంశంపై ప్రభుత్వాన్ని రైతులు ప్రశ్నించాలని రేవంత్ రెడ్డి పిలుపు ఇచ్చారు. గత తొమ్మిది ఏళ్ల ప్రభుత్వ పాలనపై రైతులు, ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. రాష్ట్రంలో థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణం పేరు మీద 30 శాతం కమిషన్లు తీసుకున్నారని ఆరోపించారు."గత కొద్ది రోజులుగా కాంగ్రెస్ ను, రేవంత్ ను తిట్టకుండా బీఆరెస్ నేతలకు రోజు గడవడం లేదు. థర్మల్ పవర్ ప్రాజెక్టుల ద్వారా విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని కబుర్లు చెప్పారు. 24 గంటల విద్యుత్ సింగిల్ ఫేజ్ అని, త్రీ ఫేస్ 24 గంటలు ఇవ్వడం లేదని సీఎండీ ప్రభాకర్ రావు జనవరి 30న చెప్పారు. ఇవాళ 24గంటల కరెంటుపై జర్నలిస్టులు ప్రశ్నిస్తే ప్రెస్ మీట్ నుంచి వెళ్లిపోయారు. వ్యవసాయానికి అవసరమైనంత మాత్రమే ఇస్తున్నామన్నారు. నేను అమెరికాలో, హైదరాబాద్ లో ప్రశ్నించింది ఇదే.. 24 గంటల కరెంటు ఇవ్వకుండా ఏటా 16 వేల కోట్లతో కరెంటు కొంటున్నారు. ఏటా రూ. 8వేల కోట్లు దోచుకుంటున్నారు." రైతులకు, కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిస్తున్నా.. రాహుల్ పై కేటీఆర్ వ్యాఖ్యలకు నిరసనగా కేటీఆర్ ను ఎక్కడికక్కడ అడ్డుకోండి. 24 గంటల విద్యుత్ ఇచ్చే వరకు రైతు వేదికలకు తాళం పెట్టి నిరసన తెలపండి. రుణమాఫీ, పోడు భూముల పట్టాలు 24 గంటల కరెంటు ఇచ్చే వరకు.. బీఆరెస్ ఎమ్మెల్యేలను చెట్లకు కట్టేసి నిలదీయండి. అవగాహన లేకే కేటీఆర్ నాపై పనికిమాలిన విమర్శలు చేస్తున్నారు. "బీజేపీ, బీఆరెస్ చీకటి మిత్రులు.. వారిద్దరిది ఫెవికాల్ బంధం. కేసీఆర్ నాయకత్వంపై హరీష్ రావుకు విశ్వాసం ఉంటే.. కేసీఆర్ ఈసారి మళ్లీ గజ్వేల్ లో పోటీ చేయాలి. సిట్టింగులందరికీ సీట్లు ఇవ్వాలి. కేసీఆర్ పాలనకు ఇదే రెఫరెండం లాంటిది. మూడోసారి అధికారంలోకి వస్తామన్న కేసీఆర్ కు గజ్వేల్ లో పోటీ చేయడానికి భయం ఎందుకు? సిట్టింగులకు సీట్లు ఇవ్వడానికి ఎందుకు జంకుతున్నారు?" అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

### రెయిన్... రెయిన్...

# హైదరాబాద్‌లో వానలే వానలు

(మొదటిపేజీ తరువాయి)

తెలుగు రాష్ట్రాల్లో జోరుగా వానలు కురిసే అవకాశం ఉందని వాతారణ శాఖ ప్రకటించింది. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రానికి హై అలర్ట్ ప్రకటించింది హైదరాబాద్ వాతావరణ కేంద్రం. వచ్చే నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. ఆంధ్రప్రదేశ్‌లోనూ అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. ఈ అల్పపీడనం ప్రభావంతో మరో రెండు రోజుల పాటు పలు చోట్ల వర్షాలు పడనున్నాయి. ఉత్తరకోస్తాంధ్ర, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో వర్షాలు కురవనున్నాయి. అయితే, ఇవాళ వాయువ్య బంగాళా ఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడనుందని, రేపు అది అల్పపీడనంగా మారే అవకాశం ఉందని తెలిపారు వాతావరణ శాఖ అధికారులు.

వాయువ్య బంగాళా ఖాతంలో, దాన్ని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా తెలంగాణలోని అదిలాబాద్, ఆసిఫాబాద్, కొమరం భీమ్, మంచిర్యాల్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాది కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట్, కామారెడ్డి, హైదరాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని ప్రకటించారు వాతావరణ శాఖ అధికారులు. మంగళవారం నాడు 21 జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించగా.. బుధవారం నాడు 7 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. బుధవారం నాడు మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్నగర్, జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని ప్రకటించారు.

ఇక హైదరబాద్‌లో ఉరుములతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయన్నారు. గరిష్ట కనిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా 28డిగ్రీ నుండి 23డిగ్రీగా ఉంటాయని తెలిపారు. ఇదిలాఉంటే.. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో నిన్నటి నుంచి జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్‌లో అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్టా, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, కొండాపూర్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, బీఎన్‌రెడ్డి, ఉప్పల్, సికింద్రాబాద్, బోయిన్‌పల్లిలో ఆగకుండా వర్షం కురుస్తోంది. ఇక ఈ వర్షం కారణంగా కొన్ని ప్రాంతాల్లో రోడ్లపైనే వర్షం నీరు నిలిచిపోయింది.

### పేదల కోసం

# వందే భారత్ సరికొత్త రైళ్లు

(మొదటిపేజీ తరువాయి)

గమ్యస్థానాలకు చేర్చుతున్నా అధిక ఛార్జీలను భరించలేక పేదలు మిగతా రైళ్లలో ప్రయాణించేందుకు మొగ్గు చూపుతున్నారు. అయితే ఎన్ని విమర్శలు వచ్చినా ఇప్పటివరకు 25 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను భారతీయ రైల్వేలు అందుబాటులోకి తెచ్చాయి. త్వరలో మరిన్ని వందే భారత్ రైళ్లను ప్రారంభించేందుకు రైల్వే ప్రణాళికలు రూపొందిస్తోంది.ఏ మాటకు ఆ మాట చెప్పాలంటే.. కొన్ని మార్గాల్లో వందేభారత్ రైళ్లకు మంచి డిమాండ్ ఉంది. కొన్ని మార్గాల్లో మాత్రం ఈ రైళ్లలో ఆక్యుపెన్సీ చాలా తక్కువగా ఉంటోంది. అయితే పేదలను దృష్టిలో పెంచుకుని రైల్వే శాఖ వందే భారత్ రైళ్లలో సరికొత్త వేరియంట్లను తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ మేరకు వందే భారత్ స్లీపర్, వందే మెట్రో, వందే సాధారణ్ రైళ్లను పరిచయం చేయనుంది. ప్రస్తుతం వందేభారత్ రైళ్లు 550 కి.మీ. వరకు కవర్ చేస్తున్నాయి. వీటిలో కేవలం చైర్‌కార్ సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. త్వరలో ప్రవేశపెట్టనున్న వందే భారత్ రైళ్లు 550 కిలోమీటర్లకు పైగా దూరాన్ని కవర్ చేయనున్నాయి. ఇందులో మిగతా రైళ్లలో మాదిరిగానే స్లీపర్ బోగీలు ఏర్పాటు చేయనున్నారు.

# ఆరోగ్యశ్రీ బోర్డు భేటీ

## హాజరయిన మంత్రి హరీష్ రావు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవడం జరిగింది. ఇందుకోసం లబ్ధిదారుల ఈ కేవైసీ ప్రక్రియను త్వరగా పూర్ చేయాలని ఆదేశించారు. నిమ్స్ స్పెషలిస్ట్ డాక్టర్ ల ద్వారా ఆరోగ్యశ్రీ కేసుల మెడికల్ ఆడిట్ నిర్వహణ చేయాలి. కోవిడ్ సమయంలో ఎక్కడా చేయని విధంగా రికార్డు స్థాయిలో 856 బ్లాక్ ఫంగస్ సర్జరీలు విజయవంతంగా నిర్వహించి, ప్రజల ప్రాణాలు కాపాడిన కోఠి ఈఎన్టీ ఆసుపత్రికి రూ. కోటి 30 లక్షల అదనపు ప్రోత్సాహకం ఇవ్వాలని నిర్ణయించారు. మూగ, చెవిటి పిల్లలకు చికిత్స అందించి బాగు చేసే కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు ప్రస్తుతం కోఠి ఈఎన్టీ ఆసుపత్రిలో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నది. ఈ తరహా సేవలను ఎంజీఎం వరంగల్ లో కూడా అందుబాటులోకి తెచ్చేందుకు కమిటీ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు రాష్ట్రంలో కేవలం 3 డయాలసిస్ కేంద్రాలు మాత్రమే ఉంటే, తెలంగాణ ప్రభుత్వం ఆ సంఖ్యను 103కు చేర్చించింది. వ్యవప్రయాసలకు ఓర్చి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నియోజకవర్గం పరిధిలోనే డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. దీంతో కిడ్నీ బాధితులకు ఇవి వరంగా మారాయి. మరింత నాణ్యంగా డయాలిసిస్ సేవలు అందించేందుకు గాను ఆన్లైన్ పర్యవేక్షణ చేసే విధంగా ప్రత్యేక సాఫ్ట్ వేర్ రూపొందించి, వినియోగించడానికి బోర్డు అనుమతి ఇచ్చింది. దీంతో పాటు ఆరోగ్యశ్రీ రోగులకు ఫేస్ రెకగ్నిషన్ సాఫ్ట్ వెర్ వినియోగానికి అనుమతి ఇచ్చింది. బయోమెట్రిక్ విధానం వల్ల కొంత ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో మరింత పారదర్శకంగా ప్రజలకు సేవలు అందించేందుకు ఈ విధానం తేవాలని నిర్ణయించింది.

# కమలంలో ఏం జరుగుతోంది

(మొదటిపేజీ తరువాయి)

నుంచే ప్రయత్నాలు ప్రారంభించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్ల రూపంలో ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని ప్రజలకు పరిచయం చేస్తోంది. ఇప్పటికే కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ఓటమిని చవిచూసిన పార్టీ త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల్లో ఎలాగైనా గెలిచి తీరాలని చూస్తోంది.మధ్యప్రదేశ్ నుంచి విడిపోయి ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిన తర్వాత సుదీర్ఘకాలం చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన రమణ్ సింగ్ భవితవ్యం ప్రస్తుతం ప్రశ్నార్థకంలో పడింది. 2003 నుంచి 2018 వరకు వరుసగా మూడు పర్యాయాలు పార్టీని గెలిపించి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న ఆయన ప్రాభవం 2018లో ఓడిపోయినప్పటి నుంచి ఒక్కసారిగా పతనమవుతూ వచ్చింది. పరాజయం తర్వాత రాజకీయాల్లో పెద్దగా క్రియాశీలంగా కనిపించకపోయినా సరే.. ఇప్పటికీ ఆ రాష్ట్రంలో బీజేపీకి ఆయనే పెద్ద దిక్కు. రమణ్ సింగ్ పాపులారిటీ, జనబాహుళ్యంలో ఉన్న ఆదరణను చూసి ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకే మరోసారి ముఖ్యమంత్రి అభ్యర్థిగా అవకాశం ఇస్తారని పార్టీ శ్రేణులు భావించాయి. కానీ ఆ రాష్ట్ర ఇంచార్జిగా పనిచేసిన పురందేశ్వరి రాష్ట్ర పార్టీలో ప్రత్యామ్నాయ నాయకత్వం అవసరం గురించి, అవకాశాల గురించి చాలా వివరంగా చెప్పారు. రాబోయే ఎన్నికల్లో అభివృద్ధే ప్రధానాంశంగా మారాలని సూచించారు. 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత 2019 లోక్‌సభ ఎన్నికల్లో రమణ్ సింగ్ కుమారుడు అభిషేక్ సింగ్‌కు టిక్కెట్ ఇవ్వకుండా పార్టీ తన ఉద్దేశాన్ని స్పష్టం చేసింది. మరోవైపు రమణ్‌సింగ్‌కు సొంత పార్టీలో ప్రత్యర్థిగా మారిన రాజ్‌సభ ఎంపీ సరోజ్ పాండేతో పాటు రమణ్‌సింగ్ మద్దతుదారులకు సైతం టిక్కెట్లను తగ్గించింది. అప్పటి నుంచే రమణ్ సింగ్‌కు ప్రత్యామ్నాయ శక్తి కోసం అధిష్టానం గాలిస్తోందన్న సంకేతాలు పార్టీలో విస్తృతంగా వెళ్లాయి. రమణ్ సింగ్ మద్దతుదారులు ఇప్పటికీ రాష్ట్ర పార్టీలో బలమైన పట్టు కలిగి ఉన్నారు. కానీ పార్టీ అధిష్టానం ఆలోచనలు మాత్రం రమణ్ సింగ్‌కు వ్యతిరేక దిశలో సాగుతున్నాయి.గత కొన్ని దశాబ్దాలుగా ప్రతి ఐదేళ్లకు అధికార మార్పిడి జరుగుతున్న రాజస్థాన్ రాష్ట్రంలో వసుంధర రాజే సింధియా బీజేపీ జాతీయ నాయకత్వానికి ఎప్పటికప్పుడు సవాల్ విసురుతూనే ఉన్నారు. కర్ణాటకలో యెడ్యూరప్ప లేని బీజేపీ ఎలాగో, రాజస్థాన్‌లో వసుంధర రాజే లేని బీజేపీ కూడా అలాగే అన్నట్టుగా ఉంది. ఆమెను కాదంటే జరిగే నష్టం కూడా జాతీయ నాయకత్వానికి తెలుసు. అలాగని ఆమెనే కొనసాగించడానికి ఇష్టపడడం లేదు. మధ్యప్రదేశ్ తరహాలో 2020లో రాజస్థాన్‌లో కూడా కమలదళం ఆపరేషన్ లోటస్ చేపట్టింది. అయితే అశోక్ గెహ్లాట్ ఈ ప్రయత్నాలకు చెక్ పెట్టి కమలనాథుల ప్రయత్నాలు బెడిసికొట్టేలా చేయగలిగాడు. గెహ్లాట్‌కు వసుంధరా రాజే సహకరించడం వల్లనే బీజేపీ ఆపరేషన్ విఫలమైందని అధినాయకత్వం అనుమానిస్తోంది. వసుంధర రాజే, అశోక్ గెహ్లాట్ మధ్య స్నేహ బంధం అటు కాంగ్రెస్, ఇటు బీజేపీలో అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. అధికార మార్పిడి అనంతరం ఒకరి తప్పిదాలను మరొకరు ఎత్తిచూపకుండా, ప్రశ్నించకుండా లోపాయకారి అవగాహన ఉందని చెప్పుకుంటారు. అందుకే వసుంధర హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై గెహ్లాట్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. ఇదే కారణంగా చూపుతూ సచిన్ పైలట్ సొంత ప్రభుత్వంపైనే తిరుగుబావుటా ఎగరేశారు.వసుంధరకు ప్రత్యామ్నాయం కోసం బీజేపీ జాతీయ నాయకత్వం నిరంతరం వెతుకుతూనే ఉంది. కానీ కొత్త నాయకత్వం బలాన్ని పూర్తిగా విశ్వసించలేకపోతోంది. వసుంధర రాజేకు బద్ధ వ్యతిరేకులుగా చెప్పుకునే ఇద్దరు నేతలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా అవకాశం కల్పించింది. కానీ వసుంధర రాజేను పూర్తిగా పక్కన పెట్టడం మాత్రం పార్టీకి సాధ్యం కాలేదు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ వసుంధర రాజేను పూర్తిగా పక్కన పెట్టేంత రిస్క్ తీసుకోవడానికి కూడా ఇష్టపడడం లేదు. కానీ వసుంధర కూడా రాజేయే తమ ముఖ్యమంత్రి అభ్యర్థి అని చెప్పడం మానుకుంది. ఇటీవల జరిగిన జాతీయ అధ్యక్షుడి పర్యటన సందర్భంగా వసుంధర వచ్చే ఎన్నికల్లో తన పాత్ర ఏంటని నిలదీసినట్టు సమాచారం.చత్తీస్‌గఢ్ రమణ్ సింగ్, రాజస్థాన్ వసుంధరా రాజేతో పోల్చితే మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌పై పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ అంత పెద్దగా వ్యతిరేకత లేనప్పటికీ ఆ రాష్ట్రంలోనూ ప్రత్యామ్నాయ నాయకత్వంపై అధిష్టానం దృష్టి సారించింది. 18 ఏళ్లుగా శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలో ప్రభుత్వం కొనసాగుతూ వస్తోంది. 2018లో జరిగిన ఎన్నికల్లో బీజేపీకే ఓట్ల శాతం ఎక్కువగా వచ్చినా సీట్లు మాత్రం కాంగ్రెస్ కంటే తక్కువ వచ్చాయి. కమల్‌నాథ్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. ఆ తర్వాత జ్యోతిరాదిత్య సింధియా రూపంలో తిరుగుబాటు జరిగి, పార్టీని చీల్చడంతో మళ్లీ శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా ఆ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌కు పార్టీ ప్రాధాన్యతనిస్తోంది. ఆయన్ను ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన గతంలో పార్టీకి రాష్ట్ర విభాగానికి అధ్యక్షులుగా కూడా పనిచేశారు. పరోక్షంగా ఆయన్ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తున్నట్టు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. అలాగని శివరాజ్ సింగ్ చౌహాన్‌ను దూరం పెడితే పరిణామాలు మరోలా ఉంటాయని కూడా పార్టీకి తెలుసు. ఆయన్ను జాతీయ నాయకత్వంలోకి తీసుకొచ్చి, రాష్ట్ర నాయకత్వాన్ని తోమర్‌కు అప్పగించవచ్చన్న చర్చ జరుగుతోంది. ఏదేమైనా ఈ మూడు రాష్ట్రాలతో పాటు ఇంకా అనేక రాష్ట్రాల్లో బీజేపీ ప్రత్యామ్నాయ నాయకత్వంపై దృష్టి పెట్టినట్టు కనిపిస్తోంది. పార్టీని ఏ ఒక్కరి చేతిలోనో పెట్టకుండా బహుముఖ నాయకత్వాన్ని ప్రజల ముందు ఉంచుతోంది.కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ అంతా తామే అన్నట్టుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కానీ స్థానికంగా రాష్ట్ర నాయకత్వం బలంగా లేకపోవడంతో ప్రజలు బీజేపీని తిరస్కరించి స్థానికంగా బలంగా ఉన్న కాంగ్రెస్ నాయకత్వానికి ఓటేశారు. కర్ణాటకలో మాత్రమే కాదు అసెంబ్లీ ఎన్నికల్లో స్థానికంగా బలంగా ఉన్న రాజకీయ పార్టీలను ఓడించడం బీజేపీకి సాధ్యం కాలేదు. కర్ణాటక, బెంగాల్, ఒడిశా, బీహార్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌తో సహా హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ మరియు ఢిల్లీలలో ప్రధాని తరచుగా పర్యటించినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించలేకపోయారు. బీజేపీ స్థానిక నాయకత్వం ప్రతిపక్ష నాయకుల కంటే బలంగా ఉన్నప్పుడే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించగల్గుతోంది. కర్నాటకలో బీజేపీకి బలమైన నాయకత్వాన్ని అందించిన యడ్యూరప్పను పక్కనపెట్టి బస్వరాజ్ బొమ్మైకి పగ్గాలు అప్పగించి చేసిన ప్రయోగం విజయవంతం కాలేదు. అదే సమయంలో హిమాచల్, పంజాబ్, ఢిల్లీ, బెంగాల్‌లలో ప్రత్యర్థులను ఢీకొట్టగలిగే బలమైన స్థానిక నాయకత్వాన్ని బీజేపీ తయారు చేయలేకపోయింది. ఉత్తరాఖండ్, గుజరాత్‌లలో బీజేపీ ఘన విజయాలు సాధించింది. ఇక్కడ ప్రధాని మోడీకి ఉన్న ఆదరణకు తోడు స్థానిక నాయకత్వం ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడం వల్లనే విజయం సాధ్యపడింది. కర్ణాటక ఉదంతాన్ని పరిగణలోకి తీసుకుంటే బలమైన నాయకత్వాన్ని తప్పిస్తే పరిణామాలు వ్యతిరేకంగా మారతాయి. అలాగని బలమైన నేతలే బరువుగా మారినప్పుడు కొనసాగించడం అవివేకం. ఈ పరిస్థితుల్లో రాష్ట్రాల్లో బలమైన నాయకత్వాన్ని కాదనకుండా ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని తయారు చేసేందుకు అధిష్టానం కసరత్తు చేస్తోంది.

## సంపాదకీయం

### ఇప్పటి వరకు లెక్క...

# ఇప్పటి నుంచి ఒక లెక్క

దేశ రాజకీయాలు శరవేగంగా మారిపోతున్నాయ్. 2024 ఎన్నికలే టార్గెట్‌గా రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది. బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా దేశంలో సరికొత్త రాజకీయ కూటమి అవతరించబోతోంది. బెంగళూరు అందుకు వేదికగా మారింది. ఇంతకీ, విపక్షాల నయా ప్లాన్ ఏంటి?. కొత్త కూటమిలో చేరబోయే పార్టీలేంటి?. కామన్ అజెండాగా ఏం ఉండబోతోంది?మొత్తం 26 పార్టీలు, అందరి టార్గెట్ ఒక్కటే. బీజేపీని ఓడించడం, మోదీ సర్కార్‌ను గద్దె దించడం, ఎలాగైనాసరే 2024లో ఢిల్లీ పీఠాన్ని దక్కించుకోవడం. ఇదీ, బెంగళూరులో జరిగిన విపక్షాల మీటింగ్ అజెండా. ఏదిఏమైనాసరే ఈసారి టార్గెట్ కొట్టాల్సిందే. బీజేపీని గద్దె దించాల్సిందేనన్న పట్టుదలతో ఉన్నాయ్ విపక్షాలు. అందుకోసం రెండ్రోజులుగా బెంగళూరు వేదికగా వ్యూహరచన చేస్తున్నాయ్.2014లో బీజేపీ ఘన విజయం సాధించింది. అప్పటి వరకూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ చాలా రాష్ట్రాల్లో ఉనికి కోల్పోయింది. క్రమంగా బీజేపీ క్యాడర్ పెరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ చరిష్మా పుణ్యమా ఆ పార్టీకి ఎక్కడిలేని బూస్టప్ వచ్చింది. ఆయనే స్టార్ క్యాంపెయినర్ అయ్యారు. బీజేపీ అంటే నరేంద్ర మోదీయే అనే స్థాయిలో తన మార్క్ చూపించారు మోదీ. అటు మోదీకి ఆదరణ పెరుగుతూ వస్తుంటే...దాదాపు 125 ఏళ్ల చరిత్ర ఉన్న కాంగ్రెస్ డీలా పడుతూ వచ్చింది. ఇప్పుడిప్పుడే కాస్త కోలుకుంటోంది. ఇప్పటివరకూ ఒకలెక్క-ఇకనుంచి మరోలెక్క అన్నట్టుగా ముందుకెళ్తున్నాయ్ విపక్షాలు. 2014, 2019 ఎన్నికల్లో చేసిన తప్పిదాలు చేయకుండా ఐక్యతను ప్రదర్శిస్తున్నాయి. అందుకే, బీజేపీని, మోదీని ఎదుర్కొనే వ్యూహాలు, జనరల్ ఎలక్షన్స్‌కు రోడ్‌మ్యాప్‌ను సిద్ధంచేసుకునే పనిలో పడ్డాయ్ విపక్షాలు. అయితే, నాన్ బీజేపీ పక్షాలను ఏకం చేయడంలో సక్సెస్ సాధించింది కాంగ్రెస్. పట్నాలో జరిగిన విపక్షాల భేటీకి కేవలం 15 పార్టీలు మాత్రమే హాజరైతే, బెంగళూరు మీటింగ్‌కి మాత్రం 26 పార్టీలు అటెండ్ కావడం దేశ రాజకీయాల్లో సంచలనంగా మారింది.రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర కొంత వరకూ ప్రభావం చూపించింది. కర్ణాటకలో ఆ పార్టీ సాధించిన విజయమే ఇందుకు ఉదాహరణ. అవి అసెంబ్లీ ఎన్నికలు. ఇప్పుడు రాబోయేవి లోక్‌సభ ఎన్నికలు. అంటే...ఢిల్లీలో ఏ పార్టీ గద్దెనెక్కుతుందో డిసైడ్ చేసే ఎలక్షన్స్ ఇవి. అందులోనూ వరుసగా రెండుసార్లు కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జోష్‌తో ఉంది బీజేపీ. ఆ పార్టీని ఒంటరిగా కాంగ్రెస్ ఢీకొట్టే పరిస్థితైతే లేదు. ఇప్పుడా పార్టీకి కావాల్సింది బలం, బలగం. ఆ బలాన్ని సమకూర్చుకునే పనిలో పడింది కాంగ్రెస్ హైకమాండ్. అందులో భాగంగానే విపక్షాలతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ బలగాన్ని పెంచుకునేందుకు తీవ్రంగానే ప్రయత్నిస్తోంది. ఇప్పుడు బెంగళూరు వేదికగా జరుగుతున్న భేటీ కూడా ఇందులో భాగమే. ఈ సమావేశానికి 26 పార్టీలకు చెందిన నేతలు హాజరవుతారని కాంగ్రెస్ స్వయంగా ప్రకటించింది. ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఈ సమావేశాన్ని లీడ్ చేయనున్నారు. ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఏంటంటే...విపక్షాలను తామే లీడ్ చేస్తున్నామని కాంగ్రెస్ పరోక్షంగా ప్రచారం చేసుకుంటోంది. ఈ సమావేశానికి ముందు కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే పట్నాలో ఓ సారి విపక్షాలు భేటీ అయ్యాయి. ఈ సమావేశం తరవాత ఎన్డీయే లో భయం మొదలైందని అన్నారు జైరాం. “మేమంతా ఒక్కటవడం బీజేపీని తెగ ఇబ్బంది పెడుతోంది. అందుకే వాళ్లు కూడా బల సమీకరణపై దృష్టి పెట్టారు” అని వెల్లడించారు. కాంగ్రెస్ సీనియర్ నేతలంతా ఇప్పుడిదే మాట చెబుతున్నారు. పైగా యూపీయే పేరు కూడా మారిపోయింది.. దేశ రాజకీయాల్లో బెంగళూరు భేటీ గేమ్ ఛేంజర్ అవుతుంది. గమనిస్తూ ఉండండి. ఇకపై ఏ విషయంలోనైనా సరే...కలిసికట్టుగా ఉంటూ నిర్ణయాలు తీసుకుంటామని కాంగ్రెస్ సీనియర్ నేతలు క్లారిటీ ఇచ్చారు. ఇప్పుడిప్పుడే విభేదాలను మర్చిపోయి పార్టీలు ఒక్కటవుతున్నాయి. జాతీయ హోదా పొందిన ఆప్, కాంగ్రెస్‌తో మైత్రికి సిద్ధమైంది. ఢిల్లీ ఆర్డినెన్స్ విషయంలో ఈ రెండు పార్టీల మధ్య సయోధ్య కుదిరింది. ఇలా పలు పార్టీలు తమ విభేదాలను పక్కన పెట్టి కలిసిపోవడం కాంగ్రెస్‌లో కాన్ఫిడెన్స్ పెంచుతోంది. అయితే...ఇక్కడ ప్రధానంగా వినిపిస్తున్న ప్రశ్న ఏంటంటే “వారసత్వ రాజకీయాలు” అనే ముద్రని బీజేపీ ఇప్పటికే విపక్షాలపై వేసేసింది. “మేం దేశం కోసం ఆలోచిస్తే..వాళ్లు కుటుంబం కోసం ఆలోచిస్తారు” అని ప్రచారం చేస్తోంది. ఇది విపక్షాలకు గట్టి దెబ్బే. అలా అని పూర్తిస్థాయిలో ఇది ప్రభావం చూపుతుందని చెప్పలేం. కాంగ్రెస్ గతంలోలా లేదు. బీజేపీ వేసే ప్రతి కౌంటర్‌ని ఎన్‌కౌంటర్ చేస్తోంది. సోషల్ మీడియాలో క్యాంపెయినింగ్ స్టైల్ కూడా మార్చింది. ఆర్నెల్లలో ఆ పార్టీలో ఎంతో కొంత మార్పు కనిపిస్తోంది. అదానీ వ్యవహారాన్ని పార్లమెంట్‌లో పదేపదే ప్రస్తావించిన పార్టీ కాంగ్రెస్ మాత్రమే. ఈ విషయంలో చాలా గట్టిగానే నిలబడింది. ఆ తరవాత రాహుల్ గాంధీపై అనర్హతా వేటు వేయడాన్నీ విపక్షాలను ఒక్కటి చేసేందుకు ఉపయోగించుకుంది. ఇందులో కొంత వరకూ కాంగ్రెస్ సక్సెస్ అయినట్టే. కానీ...ప్రస్తుతం బీజేపీ క్యాడర్ చాలా స్ట్రాంగ్‌గా ఉంది. అంత సులువుగా ఆ పార్టీని పక్కన పెట్టి ప్రజలంతా కలిసి గద్దె దించే పరిస్థితులైతే లేవు. బహుశా విపక్షాల ప్రచారంతో కొంత వరకూ సీట్లు కోల్పోయినా అధికారంలోకి రాకపోవడానికి పెద్ద కారణాలైతే కనిపించడం లేదు. ప్రధాని నరేంద్ర మోదీకి విదేశాల్లోనూ క్రేజ్ ఉండడం....ఆ పార్టీకి మరో అడ్వాంటేజ్ అయింది. ఇప్పుడు కావాల్సింది బీజేపీ విధానాలపై డైరెక్ట్ అటాక్ చేసే బలమైన కూటమి. కాంగ్రెస్ ఆ ప్రయత్నాలు మొదలు పెట్టినా...చివరి వరకూ ఆ బలం అలాగే ఉంటుందా లేదా అన్నది తేలాల్సి ఉంది.

# విపక్షాల ఆరోపణలను ప్రజలు నమ్మరు



**పరిగి – ప్రభాత సూర్యుడు :** వికారాబాద్ జిల్లా పూడూర్ మండలం చెన్గోముల్ కాంగ్రెస్ పార్టీపై విరుచు కపడ్డారు ఎంపి రంజిత్ రెడ్డి. కాంగ్రెస్ ,బీజేపీ పార్టీలు బిఆర్ఎస్ ప్రభుత్వం పై (బురద చల్లుదాం) ఏదో నింద వేద్దం అనుకుంటున్నారు. కానీ ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు ఎంపి.వ్యవసాయం చేస్తున్న రైతులకు మూడు గంటల కరెంటు చాలు అంటావా రేవంత్ అంటు నిలదీశారు ఆయన. ఇప్పుడేమో నేను అలా అనలేదు అంటు సమర్థించుకుంటుంన్నారు. గతంలో ఉచిత కరెంటు ఇచ్చాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అది వాస్తవమే కాని ఇచ్చిన 7 గంటల్లో ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.వ్యవసాయం ఎక్కువ చేసుకునేవారు కాదని,మోటర్లు కాలిపోయేటివని వలసలు వెళ్లేవారని అన్నారు.చంద్ర బాబు శిష్యుడే రేవంత్ రెడ్డి ఆయన ఆడమన్నట్లు ఆటాడుతుండని అన్నారు.గతంలో 2014 ముందు 60వేల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి ఉండేది, ఇప్పుడు అదికాస్త రెండు(2) కోట్ల 70 లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వస్తుందని అన్నారు.కేసీఆర్ ప్రభుత్వం 24 గంటల ఉచిత కరెంటు ఇవ్వడంతో సంవత్సరానికి మూడు పంటలు పండిస్తు సంతోషంగా రైతులు ఉన్నారని అన్నారు. ఉచిత విద్యుత్ కోసం 12 కోట్లు కర్చుపెడుతుంది కేసీఆర్ ప్రభుత్వం...ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఎటువంటి సమస్యలు రాకుండా చూస్తున్నారని ఎంపి రంజిత్ రెడ్డి అన్నారు.కేసీఆర్ ఉంటేనే రైతు బందు వస్తాది రైతు భీమా వస్తాది.. ఉచిత కరెంట్ వస్తాది... రైతుల మేలు ఆలోచించే వ్యక్తి ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. కాంగ్రెస్ బిజెపి మాయమాటలు నమ్మొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి పదవిపై కాంగ్రెస్ పార్టీకి ఆసక్తి లేదు

(మొదటిపేజీ తరువాయి)
భారత దేశ ఆత్మ, రాజ్యాంగం, లౌకికవాదం, సాంఘిక న్యాయం, ప్రజాస్వామ్యాలను పరిరక్షిం చడంపై మాత్రమే తమ పార్టీకి మక్కువ ఉందన్నారు. రాష్ట్ర స్థాయిలో తమ మధ్య విభేదాలు ఉన్నాయన్నారు. అధిగ మించలేనంత పెద్ద విభేదాలు కావని, ప్రజలను కాపాడటం కోసం వాటిని పక్కన పెట్టవచ్చునని చెప్పారు. ప్రజలు ద్రవ్యోల్బణంతో బాధపడు తున్నార న్నారు. నిరుద్యోగంతో బాధ పడుతున్న యువత కోసం, హక్కుల అణచివేతకు గురవుతున్న పేదలు, దళితులు, గిరిజనులు, మైనారిటీల కోసం వాటిని వదిలిపెట్టవచ్చునని చెప్పారు. సమావేశానికి హాజరైన 26 పార్టీలకు తగినంత రాజకీయ బలం ఉందని చెప్పారు. 11 రాష్ట్రాల్లో ఈ పార్టీలు అధికారంలో ఉన్నాయన్నారు. కూటముల ప్రాధాన్యాన్ని వివరిం చారు. బీజేపీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో 303 స్థానాలను దక్కించుకుందని, ఈ స్థానాలను ఆ పార్టీ తనంతట తాను గెలుచుకోలేదని అన్నారు. బీజేపీ తన మిత్ర పక్షాల ఓట్లను పొంది, అధికారంలోకి వచ్చి, ఆ తర్వాత ఆ మిత్ర పక్షాలను వదిలేసిందని చెప్పారు. ఇప్పుడు బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర నేతలు రాష్ట్రాల్లో తిరుగుతూ, పాత మిత్రులతో సత్సంబంధాల కోసం ప్రయత్నిస్తున్నారన్నారు. ఇదిలావుండగా, ప్రతిపక్షాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం తీవ్రంగా విరుచుకుపడ్డారు. బెంగళూరులో సమావేశమైన పార్టీలకు ఒకే ఒక మంత్రం ఉందని, అది.. కుటుంబం యొక్క, కుటుంబం ద్వారా, కుటుంబం కోసం అని వివరించారు. అందుకే ప్రజలు 2024లో మళ్లీ ఎన్డీయేను అధికారంలోకి తేవాలని నిర్ణయించుకున్నారన్నారు.

# ఉమెన్ చాందీ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)
సభ్యులు, కేరళ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.సుధాకరన్ మంగళవారం సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. ‘ప్రేమ’ అనే శక్తితో ప్రపంచాన్ని జయించిన రాజు కథ ముగిసిందని కె.సుధాకరన్ ట్వీట్ చేశారు. ఈ రోజు సీనియర్ ఊమెన్ చాందీ మరణం తీవ్రంగా కలచివేసిందన్నారు. ఆయన చాలా మంది వ్యక్తుల జీవితాలను ప్రభావితం చేశారని, ఆయన వారసత్వం మనస్సాక్షిలో ఎల్లప్పుడూ ప్రతిధ్వనిస్తుందని అన్నారు. ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. గొంతు సమస్యతో బెంగళూ రులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకుం టున్నారు. ఊమెన్ చాందీ 1943 అక్టోబరు 31న కొట్టాయం జిల్లాలోని కుమరకోమ్‌లో పుట్టారు. 27 ఏళ్ల వయసులోనే ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తొలిసారి పూతుపల్లి నుంచి విజయం సాధించి అసెంబ్లీలోకి అడుగు పెట్టారు. అప్పటి నుంచి అదే నియోజవర్గం నుంచి 12 సార్లు గెలుస్తూ వచ్చారు. 1977లో తొలిసారిగా మంత్రి అయ్యారు. అలా పార్టీ నాయకత్వానికి విధేయత ప్రకటిస్తూ వచ్చారు. అలా ఆయన్ని కాంగ్రెస్ అధినాయకత్వం ముఖ్యమంత్రిని చేసింది. 2004 నుంచి 2006 వరకు, 2011 నుంచి 2016 వరకు రెండు పర్యాయాలు సీఎం కుర్చీలో కూర్చున్నారు చాందీ.

# కొత్త అలయన్స్ పేరు ‘ఇండియా’

(మొదటిపేజీ తరువాయి)
ఎన్సీపీ శరద్ పవార్ వర్గం, శివసేన (యూబీటీ), సమాజ్‌వాదీ పార్టీ, ఆర్ఎల్‌డీ, అప్నాదళ్ (కే), నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ, సీపీఎం, సీపీఐ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, ఆర్ఎస్‌పీ, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్, ఎండీఎంకే, వీసీకే, కేఎండీకే, ఎంఎంకే, ఐయూ ఎంఎల్, కేరళ కాంగ్రెస్ (ఎం), కేరళ కాంగ్రెస్ (జోసఫ్) పార్టీలు పాల్గొన్నాయి. ప్రతిపక్ష పార్టీల సమావేశంలో ప్రధాన మంత్రి పదవిపై కాంగ్రెస్ పార్టీకి ఆసక్తి లేదని ఆ పార్టీ అధ్యక్షుడు ప్రకటించారు. భారత దేశ ఆత్మ, రాజ్యాంగం, లౌకికవాదం, సాంఘిక న్యాయం, ప్రజాస్వామ్యాలను పరిరక్షిం చడంపై మాత్రమే తమ పార్టీకి మక్కువ ఉందన్నారు. రాష్ట్ర స్థాయిలో తమ మధ్య విభేదాలు ఉన్నాయన్నారు. అవి అధిగమించలేనంత పెద్ద విభేదాలు కావని, ప్రజలను కాపాడటం కోసం వాటిని పక్కన పెట్టవ చ్చునని చెప్పారు. ప్రజలు ద్రవ్యోల్బణంతో బాధప డుతున్నారన్నారు. నిరుద్యోగంతో బాధ పడుతున్న యువత కోసం, హక్కుల అణచివేతకు గురవుతున్న పేదలు, దళితులు, గిరిజనులు, మైనారిటీల కోసం వాటిని వదిలిపెట్టవచ్చునని చెప్పారు.ఈ సమా వేశానికి హాజరైన 26 పార్టీలకు తగినంత రాజకీయ బలం ఉందని విపక్ష కూటమి నేతలు చెబుతున్నారు. 11 రాష్ట్రాల్లో ఈ పార్టీలు అధికారంలో ఉన్నా యన్నారు. కూటముల ప్రాధాన్యాన్ని వివరించారు. బీజేపీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో 303 స్థానాలను దక్కించుకుందని, ఈ స్థానాలను ఆ పార్టీ తనంతట తాను గెలుచుకోలేదని ఖర్గే ప్రకటించారు. బీజేపీ తన మిత్ర పక్షాల ఓట్లను పొంది, అధికారంలోకి వచ్చి, ఆ తర్వాత ఆ మిత్ర పక్షాలను వదిలేసిందని చెప్పారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర నేతలు రాష్ట్రాల్లో తిరుగుతూ, పాత మిత్రులతో సత్సంబంధాల కోసం ప్రయత్నిస్తున్నారన్నాని ఎద్దేవా చేశారు.

# కార్మికుల ఐక్య పోరాటాల ఫలితమే వేతనం పెంపు

**కార్మికుల తాత్కాలికంగా నిరవధిక సమ్మె విరమణ**
**ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు సుతారి రాములు**




**కోరుట్ల – ప్రభాత సూర్యుడు :** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హామీ ఇచ్చిన మేరకు మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ నిర్వహిస్తున్న నిరవదిక సమ్మె తాత్కాలికంగా విరమిస్తున్నామని ఎఐటియుసి సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సుతారి రాములు తెలిపారు .మంగళవారం జగిత్యాల జిల్లా లోని కోరుట్ల డివిజన్ కేంద్రంలోని సిప్రభాకర్ భవన్ లో జరిగిన మిడ్ డే మీల్స్ వర్కర్స్ సమావేశంలో సుతారి రాములు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు ఈనెల 10 నుండి రాష్ట్రవ్యాప్తంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టినున్నట్లు తెలిపారు.. ఈ మేరకు అసెంబ్లీలో సీఎం కేసీఆర్ కార్మికులకు జీవో జారీ చేసి దానిని అమలు చేయమని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నీ కోరగా జూలై నుండి పెరిగిన వేతనం 3 వేల రూపాయలు చెల్లిస్తామని ప్రకటించారు.. మిగతా డిమాండ్ ను అమలు చేయాలని కోరగా సీఎంతో చర్చించి విద్యాధికారులతో సమీక్ష నిర్వహించి అనంతరం తెలుపుతామని చెప్పారు.. దానిని స్వాగతిస్తున్నామని అన్నారు వారి మాట గౌరవించి సమ్మె తాత్కాలికంగా విరమింప చేస్తున్నామని తెలిపారు.కానీ రావాల్సిన పాత బకాయిలు చెల్లించాలని మెస్పెండింగ్ బిల్లు చెల్లించాలని కోడిగుడ్ల ధరలు మార్కెట్లో ఎక్కువ రేటు ఉందని తమ జీతం నుండి అదనంగా రెండు రూపాయలు ఒక గుడ్డుకు ఎక్కువ చెల్లించవల్సి వస్తుందన్నారు. అంగన్వాడి కేంద్రంలో సరఫరా చేసిన విధంగా నిత్యవసర సరుకులు కోడిగుడ్లు,సిలిండర్ కూడా ప్రభుత్వమేసరఫరా చేయాలన్నారు,ప్రతినెల 5వ తేదీ లోపు మేశ్చార్జులు చెల్లించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని లేని యెడల వంట కార్మికుల నిరవధిక సమె్మకొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం నేతలు కొంక భాగ్య, సంగెం పద్మ,పరమేశ్వరి, పోషక, హారిక, సునంద, పద్మ, అబేదాబేగం, సాయమ్మ, మణుగూరు హనుమంతు, చిన్నవేణి దశరథం, తదితరులు పాల్గొన్నారు.

# మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి

**- దొంగతనాల నివారణకు నిఘా వ్యవస్థను మరింత పటిష్ట పరచాలి**
**- జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్**



**జగిత్యాల – ప్రభాత సూర్యుడు :** మిస్సింగ్ కేసులతో పాటు చాలా రోజుల నుండి పెండింగ్ లో ఉన్న కేసులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జగిత్యాల రూరల్, ధర్మపురి సర్కిల్ పరిధిలో గల పోలీస్ స్టేషన్లో ఉన్న పెండింగ్ కేసులపై ఎస్పీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు నమోదైన కేసులలో నాన్ గ్రేవ్ కేసులు, గ్రేవ్ కేసుల విషయంలో తీసుకోవలసిన చర్యలు గురించి అధికారులకు వివరించారు. గత నెలలో జరిగిన గ్రేవ్ ,నాన్ గ్రేవ్,మహిళ సంబందిత నేరాలు తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. మిస్సింగ్ కేసుల గురించి మాట్లాడుతూ ఏవరైన తప్పిపోయారు అని లేదా కనిపించుటలేదు అని ఫిర్యాదు వచ్చినప్పుడు ఆ వ్యక్తి యొక్క ఫోటోని అన్ని పోలిస్టేషన్లకు పంపించి మిస్సింగ్ వ్యక్తులను కనిపెట్టడానికి ప్రయత్నం చేయాలని అన్నారు. జిల్లా లో మిస్సింగ్ అయన మహిళలు, చిన్న పిల్లలు కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వాటిని ట్రేస్ చేయాలని సూచించారు. సాధ్యమైనంత త్వరగా మిస్సయిన వారిని ట్రేస్ అవుట్ చేయాలని సూచించారు. గుర్తుతెలియని మృతదేహాలు దొరికినప్పుడు కేసు నమోదు చేయగానే వెంటనే ఫోటోలు సీసీటీఎన్ఎస్ లో అప్లోడ్ చేయాలని సూచించారు దీని ద్వారా ఎక్కడైనా మిస్సింగ్ పర్సన్ ఉంటే రాష్ట్రవ్యాప్తంగా గుర్తించి మిస్సింగ్ కేసులను ఛేదించవచ్చని సూచించారు. దోపిడీ, దొంగతనాలు ఇతర రకాల నేరాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవడంతో పాటు పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. దొంగతనాల నివారణకు రాత్రిపూట పెట్రోలింగ్ వ్యవస్థను, నిఘా వ్యవస్థను పటిష్ట పరచాలి అని తెలిపారు. దొంగతనాల నివారణకు ప్రతి సర్కిల్ పరిధిలో ఒక స్పెషల్ టీం ను నియమించి వాటి నివారణకు కృషి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నేర నియంత్రణ చర్యలలో కీలక పాత్ర పోషించే సి సి కెమెరాల ఏర్పాటు లో ప్రజలకు సీసీ కెమెరాల ఉపయోగలపై అవగాహన కలిగిస్తూ ప్రజలను, వ్యాపారులను భగస్వామ్యులను చేయాలని, జిల్లాలో ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు ఎన్ని ఉన్నాయి, ఎన్ని కెమెరాలు పని చేయు స్థితిలో ఉన్నాయి. ఇంకా ఎన్ని ప్రదేశాల్లో అవసరం ఉన్నాయో పూర్తి వివరాలు సేకరించాలని అన్నారు.ఈ సమావేశంలో డిఎస్పీలు వెంకటస్వామి, శ్రీనివాస్, సి.ఐలు రమణమూర్తి ,ఆరిఫ్ అలీ ఖాన్, ఎస్సైలు, డీసీఆర్బీ, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పలు జాగ్రత్తలు పాటించాలి

**- వార్డు సందర్శనలో మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ**



మంథని - ప్రభాత సూర్యుడు :

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు పలు జాగ్రత్తలు పాటించాలని మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ సూచించారు.మంగళవారం మంథని పట్టణంలోని 6వ వార్డ్ బోయినిపేటలో వార్డు సందర్శన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్పర్సన్ పుట్ట శైలజ నిర్వహించారు. వర్షా కాలం నేపథ్యంలో స్థానిక ప్రజలతో సీజనల్ వ్యాధుల రాకుండా పరిసరాలు పరిశు భ్రంగా ఉంచుకోవాలనీ తెలియజేశారు. బోయినిపేటలో పలు అభివృద్ధి పనులకు స్థల పరిశీలన చేశారు. పలు వీధులలో జరుగుతున్న అభివృద్ధి పనులను, సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆమె స్థానిక కౌన్సిలర్ కాయితి సమ్మయ్య తో కలసి పరిశీలించారు. ప్రజలను నేరుగా కలిసి ముచ్చటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బోయినపేటలో ఇంకా కొన్ని సీసీ రోడ్లను నిర్మించాలని ప్రజలు కోరారు. అదే విధంగా గొల్లగూడెంలో బలవీర హనుమాన్ దేవాలయం ముందు రాధాకృష్ణుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని యాదవ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. మీ విజ్ఞప్తులను తప్పకుండా పరిశీలిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ వార్డు సందర్శనలో తెనుగు గూడెం, గొల్ల గూడెం ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈటల రాజేందర్ ను కలిసిన ముదిరాజ్ మహాసభ నాయకులు



**కమాన్ పూర్ – ప్రభాత సూర్యుడు:** హుజురాబాద్ ఎమ్మెల్యే మాజీ మంత్రి ఈటల రాజేందర్ ను మంగళవారం ముదిరాజ్ మహాసభ నాయకులు సన్మానించారు. మాజీ మంత్రి , హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ ముదిరాజ్ ని వారి నివాసంలో కలిసి ఇటీవల బిజెపి రాష్ట్ర ఎన్నిక కమిటీ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. రాజేందర్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పిల్లి చంద్రశేఖర్ ముదిరాజ్ మరియు రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు విరబోయిన రాజేందర్ ముదిరాజ్ , ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు.

## కేటీఆర్‌కు ఆ స్థాయి లేదు

**మాజీ డీసీసీ ప్రెసిడెంట్ జంగా రాఘవ రెడ్డి**

**జనగామ– ప్రభాత సూర్యుడు :** సిరిసిల్ల లో రాహుల్ గాంధీ పై కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తున్నానని మాజీ డీసీసీ ప్రెసిడెంట్ జంగా రాఘవ రెడ్డి అన్నారు. మంగళవారం అయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ ఎప్పుడైన వ్యవసాయం చేసావా...రాష్ట్ర ఏర్పాటులో నీ పాత్ర ఎంతని ప్రశ్నించారు. కేటీఆర్ తన స్థాయికి మించి మాట్లాడుతున్నాడు. ఆంధ్ర వలసవాది పేరు నీది. .తెలంగాణ వాదులని తిట్టిన చరిత్ర నీది. రాహుల్ గాంధీ గోరుకు ఉన్న చరిత్ర కూడా నీకు లేదు. .అమరవీరుల రక్తపు కూడు తింటున్నారు. రైతులకి రుణమాఫీ చేసి మళ్ళీ రుణాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ దే. టీఆరెస్ పార్టీని విలీనం చేస్తా అని చెప్పి మోసం చేసావని ఆరోపించారు. వరంగల్ కు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా బీఆర్ఎస్ నెరవేర్చలేదు. మిగులు బడ్జెట్ లో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది మీరు కాదా? చదువుకొని ఎర్రబెల్లి మాటలు పట్టించుకోం. రేషన్ డీలర్ గా వున్నపుడే ప్రజల్ని మోసం చేసిన వ్యక్తి ఎర్రబెల్లని విమర్శించారు.

## ఎమ్మెల్యే ఆరూరి రమేష్ కి తప్పని అసమ్మతి సెగ

**వరంగల్ –ప్రభాత సూర్యుడు :**

ఎమ్మెల్యే ఆరూరి రమేష్ కు అసమ్మతి సెగ తప్పడంలేదు. వర్ధన్నపేటలో ఉద్యమకారులు, స్థానిక నేతలు తాము సైతం అంటున్నారు. ఈ నేపథ్యంలో వర్ధన్నపేట అధికార పార్టీలో లుక లుకలు బయటపడ్డాయి. ఆరూరి కి టికెట్ ఇవ్వద్దంటూ బీఆర్ఎస్ పార్టీ పెద్దల దృష్టికి ఉద్యమకారులు తీసుకుకెళ్లారు. వర్ధన్నపేటలో గెలుపు నల్లేరుపై నడకే అనుకున్న ఆరూరికి ఇంటిపోరు తప్పడంలేదు. రెండుసార్లు ఎమ్మెల్యే గా ఉండి స్థానిక నేతలను,ఉద్యమకారులను పంట్టిచుకోలేదని ఆరోపిస్తున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులకు, రియాల్టర్ లకే ప్రాధాన్యత ఇస్తాడని విమర్శలు వచ్చాయి. మొత్తానికి వర్ధన్నపేట బీఆర్ఎస్ రాజకీయాలు కాకరేపుతున్నాయి.

## కాంట్రాక్ట్ ఆధ్యాపకుల అందోళన

**వరంగల్ – ప్రభాత సూర్యుడు :**

కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల జేఏసీ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజేషన్ చేయాలని మంగళవారం హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ముందు ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ గోపీనాథ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజేషన్ చేయాలన్నారు.రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో పనిచేస్తున్న 1475 కాంటాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# కేసీఆర్ వచ్చాక వ్యవసాయమే పండుగ మార్చారు

**ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత**



**జగిత్యాల – ప్రభాత సూర్యుడు :** కటిక చీకట్లో కాంగ్రెస్ కావాలా.. కరెంట్ వెలుగుల బీఆర్ఎస్ కావాలా.. తెలంగాణ రైతులు తేల్చుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మూడు పంటలు కావాలా.. కాంగ్రెస్ పార్టీ మూడు గంటలు కావాలా... రైతులు ఆలోచించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్. సంజయ్ కుమార్, జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు..జగిత్యాల రూరల్ మండల కల్లెడ గ్రామంలో రైతు వేదిక వద్ద కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా రైతులతో కలిసిఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ గారు,జెడ్పీ చైర్మన్ దావ వసంత– సురేష్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే, జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూకాంగ్రెస్ ,బిజెపి రెండు పార్టీ లు రైతుల పాలిట రాబందుల్లా తయారయ్యారని అన్నారు. రైతు ఆకలి చావులకు కారణం కాంగ్రెస్ పార్టీ అన్నారు.తెలంగాణ రాకముందు వచ్చిన తర్వాత రాష్ట్రం అన్ని రంగాల్లో కరెంట్, విద్య, వ్యవసాయం, వైద్యం,ె ఎన్షన్,కుల వృత్తులు అన్నింట్లో తెలంగాణ అభివృద్ధి చెందిందన్నారు.గతంలో కంటే 2300 ఎకరాల్లో విస్తీర్ణం పెరిగిందన్నారు.గుల్ల పెట్ లో చెక్ డ్యాం మత్తడి పారుతుందని , రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు..కల్లేడ రైతు వేదిక క్లస్టర్ గ్రామాల్లో 5,200 ఎకరాలలో పంటల సాగు అవుతుందని తెలిపారు.క్లస్టర్ గ్రామాల్లో ఇప్పటి వరకు 21 కోట్ల 26 లక్షల రైతు బందు జమ అయ్యాయిని,రైతు ఏ కారణం తో మరణించిన కల్లేడ క్లస్టర్ 2 కోట్ల 85 లక్షల రూపాయలు రైతు భీమా మరణించిన రైతు కుటుంబాల ఖాతాలో జమ అయ్యాయిని చెప్పారు.కాళేశ్వరం దండగ అనే నాయకులకు రైతులు బుద్ది చెప్పాలని సూచించారు.తెలంగాణ వస్తె చీకట్లో ఉంటారని కాంగ్రెస్ నాయకులు ఎద్దేవా చేశారని గుర్తు చేశారు.15 వేల మేఘా వాట్ల నుండి 18 వేల మేఘా వాట్లా కరెంట్ ఇస్తామని సీఎండీ ప్రభాకర్ రావు ప్రకటించారన్నారు.మంచి సుపరి పాలన వల్లనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని,ప్రతి గ్రామంలో చర్చ జరగాలి...కేసిఆర్ పథకాలు దేశంలో ఎక్కడా అమలు కావడం లేదని అన్నారు.ఈ క్లస్టర్ గ్రామాల్లో గతానికి ఇప్పటికీ 2 వేల ఎకరాలు విస్తీర్ణం ఎలా పెరిగింది అని ప్రశ్న వేసుకోవాలి...అన్ని వేళలా ప్రజలకు, రైతులకు అండగా ఉంటామని అన్నారు. మోగులుకు రైతులు మొఖం పెట్టకుండా..కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించి పడమర నుండి తూర్పు కు నీరు పారిస్తున్న అపర భగీరథుడు కేసిఆర్ కొనియాడారు. దేశానికే అన్నం పెట్టే స్థాయి తెలంగాణ అని ,ఆంధ్ర అన్నపూర్ణ గా పిలిచే ఆంధ్రాలో నేడు బియ్యం కొరత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రప్రసాద్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ నక్కల రవీందర్ రెడ్డి,జిల్లా రైతు బందు సభ్యులు బాల ముకుందం, పాక్స్ ఛైర్మెన్ సందీప్ రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్ లు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి

**జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా**



**జగిత్యాల –పభాత సూర్యుడు :** 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ కమిషనర్లు, బూత్ స్థాయి సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య వంతమైన, తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేయాలని, చట్టపరిధిలో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తుందని, ఎన్నికల నియమావళి ననుసరించి విధులు నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన వారందరి పేర్లను ఓటరు జాబితాలో ఓటరుగా నమోదు చేయాలని, బూతు స్థాయి అధికారులు వారి పరిధిలోని ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించాలని అన్నారు. ఓటరుగా నమోదు, మార్పులు–చేర్పులు, తొల గింపులకు సంబంధించిన సమాచారంతో పాటు అందుకు అవసరమైన సమాచారం సేకరించి నిర్ణీత ఫారాల ద్వారా పనులు పూర్తీ చేయాలని, ఎన్నికల కమిషన్ జారీ చేస్తున్న ప్రతీ అంశాన్ని ఎన్నికల సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ట్రాన్స్ జెండర్లు , సెక్స్ వర్కర్ల సమాచారాన్ని సేకరించి వారికి ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత ఆయా బూతు స్థాయి అధికారులకు ఉందని అన్నారు.దివ్యాంగుల ఓటర్ల పేరును నమోదు చేసి ఫ్లాగ్ చేయాలని అన్నారు. జెండర్, ఈ పి రేషియో లను పరిశీలించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని బూతు స్థాయి అధికారులకు ఆయా సహాయ ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఓటరు జాబితా నుండి పేరును తొలగించే సమయంలో తొలగింపుకు కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని అన్నారు. జిల్లాలో 18, 19 ఏళ్ళ వయస్సు కలిగిన యువత పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేయడంలో కొంత వ్యత్యాసం ఉన్నట్లు గమనించడం జరిగిందని, అలాగే 80 సంవత్సరాలకు పైబడి ఉన్న వారి పేర్ల తొలగింపునకు సమాచారాన్ని సేకరించాలని అన్నారు.ఒక ఫారంలో నమోదు చేయాల్సిన వివరాలు మరో ఫారంలో నమోదు చేయడం వలన తొలగింపునకు కారణం అవుతున్నాయని అన్నారు. నిర్దిష్ట ఫారాలలో పూర్తీ సమాచారాన్ని నమోదు చేయాలని అన్నారు. గత జనవరి 5 న ఫైనల్ ఎలక్టోరల్ సిద్దం చేయడం జరిగిందని, త్వరలో జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెండవ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టడం జరుతున్నదని, అక్టోబర్ 1, 2023 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరి పేరు ఓటరుగా నమోదు చేయవలసి ఉందని అన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, మాస్టర్ ట్రైనర్లు సంతోష్, నవీన్, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లాలో ఫ్లెక్సీల రగడ

**నిజామాబాద్,–ప్రభాత సూర్యుడు :** కామారెడ్డి జిల్లాలో ఫ్లెక్సీల రగడ కొనసాగుతోంది. జిల్లా అధ్యక్షుడు ముజిబుద్దీన్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో తప్పుడు లెక్కలు ఉన్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తప్పుడు లెక్కలతో ఓ ఫ్లెక్సీని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేశారు. అయితే దీనిపై పట్ల ఆ గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. ఇక వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో ప్రభుత్వ పథకాల పేరిట అధికార పార్టీ బీఆర్ఎస్ ఫ్లెక్సీనీ ఏర్పాటు చేసింది. ఈ ఫ్లెక్సీలో గ్రామానికి చెందిన 14 మంది గొల్ల కుర్మలకు13.25 లక్షల రూాయాయల గొర్రెల యూనిట్లు పంపిణీ చేసినట్లు ఆ ఫ్లెక్సీలో ఉంది. దీంతో తమ గ్రామంలోని గొల్ల కుర్మలు లేకున్నా కూడా ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం పట్ల గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం ఈ ఫ్లెక్సీకి సంబంధించిన సన్నివేశాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. గత మూడు రోజులుగా కామారెడ్డి నియోజకవర్గంలోని దోమకొండ మండలం గొట్టుముకల గ్రామంలో, భిక్కనూర్ మండలం ర్యాగట్లపల్లిలో, రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో తప్పుడు లెక్కలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో నియోజకవర్గం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లేని పథకాలను ఉన్నట్లు చూపిస్తున్నారని ముజిబుద్దీన్ పై ధ్వజమెత్తుతున్నారు. ప్రస్తుతం ఈ మూడు గ్రామాలకు సంబంధించిన ఫ్లెక్సీలు కామారెడ్డి నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారాయి.

## విహార యాత్రలో విషాదం

**ఆనకట్టలో యువకుడు మృతి**

**నిర్మల్ – ప్రభాత సూర్యుడు :** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని సదర్మాట్ ఆనకట్ట వద్ద విషాదం నెలకొంది. జగిత్యాల జిల్లా నుంచి ఏడుగురు మిత్రులు విహారయాత్రకు వచ్చారు. మెట్ పల్లికి పట్టణానికి చెందిన రిహాన్( 17) అనె యువకుడు కాలు జారీ నీటిలో పడి గల్లంతు అయ్యాడు. సదర్మాట్ ఆనకట్టకు సమీపంలో యువకుని మృత దేహం లభ్యం అయింది. పోలీసులు మృత దేహాన్ని ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విహార యాత్ర కాస్త విషాదం కావడంతో మిత్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అవుతున్నారు.

**కామారెడ్డిలో కలకలం రేపుతున్న**

## సూసైడ్ నోట్ , సెల్ఫీ విడియో

**నిజామాబాద్– ప్రభాత సూర్యుడు :**

కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం సింగరాయిపల్లి మాజీ సర్పంచ్ సత్య గౌడ్ అదృశ్యం కలకలం రేపుతోంది. తన చావుకు ఆ నలుగురే కారణం అంటూ తీసిన సెల్ఫీ వీడియోతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. అదృశ్యమైన సత్య గౌడ్.. గ్రామ సర్పంచ్ భర్త అధికం నర్సాగౌడ్ అనుమానాస్పద మృతి కేసులో అరెస్టై ఇటీవల బెయిలుపై బయటకు వచ్చాడు. తాను గ్రామంలో సిసిరోడ్డు పనులు చేశానని, దాని బిల్లుకు సంబంధించిన చెక్కు వచ్చినా పని చేసినట్టు రుజువు ఏంటి అని ఎంపీఓ సరితా చెక్కు ఇవ్వలేదన్నారు.

చెక్కు తనకు రాకుండా గ్రామానికి చెందిన అధికం రాజేందర్ గౌడ్, తోట భూమయ్య, గొల్ల అంజయ్య, ఇసాయిపేట సర్పంచ్ బాలాగౌడ్ కలిసి చెక్కును అధికం నిఖిల్ గౌడ్ రాసుకున్నారని సూసైడ్ నోట్, సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు.ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సైతం తాను చేసిన పనికి సర్పంచ్ వాళ్లనే డబ్బులు డ్రా చేసుకొమ్మని చెప్పారని సెల్ఫీ వీడియోలో పేర్కొన్నారు. ఇప్పటికే అప్పుల బాధ తాళలేక అర ఎకరం భూమి అమ్ముకున్నానని, ఇప్పుడు డబ్బులు రాకుండా అడ్డుకోవడంతో మనోవేదనకు గురై సూసైడ్ చేసుకుంటానని పేర్కొన్నాడు. తన చావుకు ఆ నలుగురే కారణమని సెల్ఫీ వీడియో తీసుకుని, మొబైల్ ఫోన్, బైకు ఇంటివద్దనే ఉంచి ఆదివారం ఇంటినుంచి వెళ్లిపోయాడని సత్య గౌడ్ కుటుంబ సభ్యులు తెలిపారు. బెయిలుపై వచ్చిన నుంచి కామారెడ్డిలోని రాజీవ్ నగర్ కాలనీలో ఉంటున్నామని తెలిపారు. సత్య గౌడ్ భార్య లింగమణి కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ లో సత్యాగౌడ్ అదృశ్యం అయినట్టు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కామారెడ్డి పట్టణ సీఐ నరేష్ తెలిపారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215